క్లుప్తంగా

మొక్కలు నాటిన ఎంపీడీఓ

సంతనూతలపాడు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా సంతనూతలపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద శనివారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు మొక్కలు నాటారు. 30 మొక్కలు నాటగా, ఈవోఆర్డీ ఎం.రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 21 మంది గైర్హాజరు

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 187 మంది విద్యార్థులకుగానూ 166 మంది హాజరవగా, 21 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ప్రవీణ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కరవది ప్లస్ టు, రాఘవ ఒకేషనల్ జూనియర్ కాలేజీలకు పరీక్ష కేంద్రంగా మద్దిపాడు కళాశాలను కేటాయించినట్లు ఆమె తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: 2025–26 విద్యా సంవత్సరంలో సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకాశం జిల్లా కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల విద్యాలయ ప్రధానాచార్యులు డి.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8 తరగతులలో కూడా మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అన్ని తరగతులకు ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించనునట్లు వెల్లడించారు. విద్యార్థులు https://aprs.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన అజయ్ కుమార్

మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై మండలంలోని ఏడుగుండ్లపాడు వద్ద శనివారం జరిగింది. ఒంగోలు నుంచి అద్దంకి వెళ్తున్న తాటి అజయ్ కుమార్, అతని తల్లి పుష్పావతి మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఇసుజు వాహనం ఢీకొట్టింది. మోటార్ సైకిల్‌పై నుంచి ఇద్దరూ ఎగిరి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హైవే పెట్రోలింగ్ పోలీసులకు తెలుపగా, వారు ఘటన స్థలానికి చేరుకుని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. ఇసుజు వాహనం నడుపుతున్న కనుమూరి శ్రీహరిరావును అదుపులోకి తీసుకుని మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.


పరీక్ష రాస్తున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినికి జాగ్రత్తలు చెబుతున్న తల్లి

పరీక్ష కాలం..!

ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం మొదటి సంవత్సరం విద్యార్థులు తొలి పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హడావిడిగా కనిపించారు. పలువురు విద్యార్థులు ముందుగా ఆలయాల్లో హాల్‌టికెట్లతో పూజలు చేశారు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

- సాక్షి, ఒంగోలు


పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థి


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధ్యాపకుడు


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినికి ఆల్ ది బెస్ట్ చెబుతున్న తల్లి


విద్యార్థుల హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది


పరీక్షకు వెళ్లేముందు ఒంగోలులోని సాయిబాబా ఆలయంలో స్వామివారి ఆశీసులు అందుకుంటున్న విద్యార్థులు

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

ఒంగోలు సబర్బన్: నగరంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం పంపిణీ చేశారు. స్థానిక 48, 49 డివిజన్లలో అర్హులకు పింఛన్లు అందజేశారు. ఆయా డివిజన్ల పరిధిలోని సత్యనారాయణపురంతో పాటు పలు ప్రాంతాల్లో పంపిణీ చేయగా, నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీప్రసన్న, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.


పింఛన్లు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఉపాధి పనులను పరిశీలించిన పీడీ

చీమకుర్తి రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను డ్వామా పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ జోసఫ్ కుమార్ శనివారం ఉదయం మంచికలపాడు సచివాలయం పరిధిలోని చీమలమర్రిలో పరిశీలించారు. సేద్యపు నీటి కుంట పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు. సేద్యపు నీటి కుంటల వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం చీమలమర్రిలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్‌ను పరిశీలించారు. మండల డెవలప్మెంట్ అధికారి కే రాఘవేంద్ర, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నవోదయలో ఘనంగా వార్షికోత్సవం

ఒంగోలు సిటీ: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 36వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉపేంద్ర కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యాలయం ప్రధానాచార్యులు గీతాలక్ష్మి, ఉప ప్రధానాచార్యులు శివరాం, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆటల పోటీలు, పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి, జాతీయ క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలు, చదువులో అగ్రగామిగా నిలిచిన ఆరావళి సదనమునకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

మద్యం దుకాణం తనిఖీ

మద్దిపాడు: మండలంలోని బెల్లంపల్లి గ్రామంలో మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ సీఐ సుకన్య శనివారం తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. దుకాణంలోని రిజిస్టర్లను పరిశీలించి స్టాక్‌తో సరిపోల్చారు. దుకాణాల వద్ద మద్యం సేవించకుండా చూడాలని లైసెన్స్‌దారులను ఆదేశించారు. ఆమె వెంట ఎస్సై నగేష్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ సుకన్య

విద్యార్థులు ఇష్టంతో చదివితేనే ఉన్నత శిఖరాలు


సంతనూతలపాడు హైస్కూల్ ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు


కొత్తపట్నం హైస్కూల్లో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీదేవి

సంతనూతలపాడు: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి బాగా చదివి ముందంజలో నిలవాలని సంతనూతలపాడు హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద సూచించారు. సంతనూతలపాడులోని సూదనగుంట కోటయ్య చౌదరి హైస్కూల్లో శనివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. మొదట సరస్వతీదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో డి.వెంకారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కొత్తపట్నంలో...

కొత్తపట్నం: స్థానిక హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు శనివారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. సరస్వతీదేవికి పూజలు చేశారు. సెక్షన్ల వారీగా గ్రూప్ ఫొటో తీయించారు. మధ్యాహ్న భోజనం అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్టాఫ్ సెక్రటరీ హరిబాబు, ఫంక్షన్ ఆర్గనైజర్ శరత్‌చంద్ర, స్కూల్ ఫస్ట్ అసిస్టెంట్ సాయి కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం పోరాడదాం

ఒంగోలు టౌన్: సమాజంలో మహిళలపై విచ్చలవిడిగా జరుగుతున్న లైంగిక హింసను ప్రతిఘటించాలని ప్రగతిశీల మహిళా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ పిలుపునిచ్చారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం మహిళలు పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. నగరంలోని ఆ సంస్థ జిల్లా కార్యాలయంలో పీఓడబ్ల్యూ విలీన సభకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించలేని మోదీ ప్రభుత్వం వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కుంభమేళాలు నిర్వహిస్తోందని విమర్శించారు. పరిపాలన వదిలిపెట్టి మత కార్యకలాపాలతో కాలం వెళ్లబుచ్చుతున్న మోదీ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని ఎన్జీఓ హోంలో జరుగుతున్న పీఓడబ్ల్యూ విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. ఆ సంస్థ జిల్లా కార్యదర్శి వి.మంజుల, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ పద్మ, అమ్మాజీ, సుజాత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులతో పాటు ఎన్‌ఎంఆర్‌లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలని, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులపట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్మికులకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్మిక సంఘ నాయకులు పద్మ, ఏడుకొండలు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

93.63 శాతం పెన్షన్ల పంపిణీ

సంతనూతలపాడు: మండలంలో 93.63 శాతం పెన్షన్ల పంపిణీ శనివారం పూర్తయినట్లు ఎంపీడీవో డి.సురేష్ బాబు తెలిపారు. పేర్నమిట్టలోని ఒంగోలు 42వ డివిజన్ శాంతినగర్లో ఎమ్మెల్యే విజయ్ కుమార్ పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. మండలంలో 6,706 మంది లబ్ధిదారులకుగానూ 6,279 మందికి పెన్షన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు ఆపాలి


సంతనూతలపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ అజయ్‌బాబు


చీమకుర్తిలో ఓపెన్ హౌస్ గురించి విద్యార్థినులకు వివరిస్తున్న సీఐ సుబ్బారావు


మద్దిపాడులో విద్యార్థినులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీకాంత్

మద్దిపాడు: బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా ఆపాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ అన్నారు. ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మద్దిపాడు పాఠశాలల విద్యార్థినులు సందర్శించగా, వారితో సీఐ మాట్లాడారు. సమాజంలో చెడు ప్రవర్తన కలిగి తిరిగే వారి పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు తమకు జరిగే ఇబ్బందులను చెప్పలేకపోతున్నారని, అందువలన అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోతోందని అన్నారు. విద్యార్థినులు ఇప్పటికైనా ఆలోచనతో తమ పట్ల జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించాలని అదే క్రమంలో ఇటీవల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మహిళా హెల్ప్ డెస్క్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆ విధంగా ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ స్టేషన్లో ఎటువంటి కార్యక్రమాలు జరుగుతాయనే విషయాలను విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటలక్ష్మి, హెచ్‌జీ పద్మ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎస్సై వి.అజయ్‌బాబు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మహిళా సహాయ కేంద్రాన్ని శనివారం ఒంగోలు రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ మహిళా విభాగం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు అంశాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ పనితీరు గురించి వివరించారు. యూనివర్సిటీ ఒంగోలు ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్ చైర్‌పర్సన్ అక్కల పావని, పీడీ లావణ్య, విద్యార్థినులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: ఓపెన్ హౌస్ గురించి సీఐ ఎం.సుబ్బారావు విద్యార్థినులకు వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా శనివారం చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు లభించే సేవలపై అవగాహన కల్పించారు.

లోక్ అదాలత్ ద్వారా ఉచిత న్యాయ సహాయం

సంతనూతలపాడు: లోక్ అదాలత్ కోర్టు ద్వారా పేదలకు ఉచితంగా న్యాయసహాయం అందుతుందని న్యాయవాది, లోక్ అదాలత్ కోర్ట్ ప్యానల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి ఆదేశాల మేరకు ఇటీవల 15 రోజులపాటు మండలంలో దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక పరిశీలన చేశామని తెలిపారు. ఆ సందర్భంగా ఆరోగ్య, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో లోక్ అదాలత్ ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ లీగల్ గ్రూప్ దృష్టిలోకి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నమన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో శృతి అనే విద్యార్థిని అనారోగ్యంతో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్స్ రెండో సంవత్సరం పరీక్షను ఏడాదికాలంగా రాయలేకపోయిందని గుర్తించిన ఇంటిగ్రేటెడ్ లీగల్ గ్రూప్.. సదరు కళాశాల యాజమాన్యంతో మాట్లాడి మార్చి 7వ తేదీ నిర్వహించనున్న పరీక్షకు విద్యార్థిని హాజరయ్యేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. సంబంధిత హాల్ టికెట్ను విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ పి.సతీష్, స్థానిక ఏఎన్ఎం సునీత, ఆశా వర్కర్ జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలి

● విద్యార్థులకు డీఈవో కిరణ్‌కుమార్ పిలుపు


మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

ఒంగోలు సిటీ: వికసిత్ భారత దిశగా విద్యార్థులు శాస్త్రీయ ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలని డీఈవో అత్తోట కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన సెమినార్‌లో డీఈఓ కిరణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు మక్కువ పెంచే విధంగా సృజనాత్మకమైన, నూతనత్వంతో కూడిన, పర్యావరణహితమైన, సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా నూతన ఆలోచనలు పెంపొందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి ఏ చంద్రమౌలేశ్వర్, సమగ్ర శిక్ష ఏఎంఓ ఎం.రమేష్, ఒంగోలు ఎంఈఓ కిషోర్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రమేష్ పాల్గొని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిలిండర్‌కు అదనంగా డబ్బు వసూలు చేయరాదు

ఒంగోలు సిటీ: గ్యాస్ డెలివరీ బాయ్‌లు రసీదుకు మించి అదనంగా డబ్బు వసూలు చేయరాదని కలెక్టర్ తమీమ్‌అన్సారియా స్పష్టం చేశారు. శనివారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ అమలుపై గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొందరు గ్యాస్ డెలివరీ బాయ్‌లు రసీదుకు మించి అదనంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి 10 మంది గ్యాస్ డెలివరీ బాయ్‌లకు సంబంధించిన 4 గ్యాస్ ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఒంగోలు టౌన్: నగరంలోని దారావారితోటలో ఈ నెల 23వ తేదీ బొమ్మలు విక్రయించుకుని జీవించే మస్తాన్ బాబా ఇంట్లో జరిగిన చోరీ కేసులో ప్రస్తుతం హౌసింగ్ బోర్డులో నివసిస్తున్న షేక్ ఖాజాను అరెస్టు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ వై.నాగరాజు తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. మామిడిపాలెం సెంటర్ నుంచి భాగ్యనగర్ వెళ్లే దారిలో గల జంక్షన్ వద్ద సాయంత్రం 6.30 గంటలకు నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో 5,60,000 విలువ చేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.

రేషన్ షాపులు, ఎండీయూ వాహనాల తనిఖీ

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పరిధిలో గల రేషన్ షాపులు, నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలను శనివారం ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ బి.రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. పీర్లమాన్యంలోని 29వ నంబర్ రేషన్ దుకాణాన్ని, పేర్నమిట్టలోని 27వ నంబర్ రేషన్ షాపును డిప్యూటీ తహసీల్దార్ రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. రేషన్ డిపో ఎండీయూ వాహనాల్లో రేషన్ బియ్యం, పంచదార, నిల్వ ఉన్న సరుకులను ఆమె పరిశీలించారు. రికార్డుల ప్రకారం సరుకులున్నట్టు గుర్తించామని తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చీమకుర్తి రూరల్: మండలంలోని చంద్రపాడు గ్రామ పొలాల్లో పేకాటాడుతున్న ఆరుగురు జూదరులను శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో పోలీసులు అరెస్టు చేసి చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద ఉన్న రూ.26,250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు.

విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ


నాగులుప్పలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


మద్దిపాడు: విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

మద్దిపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఐసీడీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గుండ్లాపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో శనివారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ పల్లకి పద్మకుమారి హాజరై మహిళలు అన్నిరంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే ఇబ్బందుల గురించి బహిరంగంగా చర్చించాలని, తద్వారా వారి సమస్యలు పరిష్కరించేందుకు వీలవుతుందని అన్నారు. అనంతరం బాలికల జన్మదినోత్సవాలకు గుర్తుగా పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: చక్కని సమాజం మహిళల భద్రతపైనే ఆధారపడి ఉంటుందని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శనివారం నాగులుప్పలపాడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళల రక్షణపై నినాదాలు చేస్తూ సమాజంలో మహిళల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంఈవో రవి, రమణయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బేటీ బచావో.. బేటీ పడావో అనే నినాదంతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ డి.వెంకారెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ప్రమోద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతీబాయ్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.